
సాక్షి
నల్లగొండ
మంగళవారం । 23 । జూలై । 2024



మహిళల ఆత్మహత్యాయత్నం
భూమి అక్రమంగా పట్టా చేయించుకున్నా రన్న ఆవేదనతో మహిళలు కలెక్టరేట్‌లో ఆత్మహత్యకు యత్నించారు. -8లో



గంజాయి ముఠా అరెస్ట్
గంజాయి విక్రయిస్తున్న ముఠాను చిలుకూరు మండలం బేతవోలులో పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



వరద నీటిని ఒడిసిపట్టేందుకు..
సాగర్ జలాశయానికి ఎగువ నుంచి వరద వస్తున్న నేపథ్యంలో గేట్లకు మరమ్మతులు చేపట్టారు. - 8లో

రెవెన్యూ.. రుణమాఫీ

ఈ రెండు సమస్యలపైనే గ్రీవెన్స్ డేలో భారీగా వినతులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, పక్కన అదనపు కలెక్టర్లు

- కలెక్టరేట్‌కు పెద్దసంఖ్యలో తరలివచ్చిన బాధితులు
- ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్, అదనపు కలెక్టర్లు
- రుణమాఫీ సమస్యలపై ప్రత్యేక సెల్ ఏర్పాటు



రుణమాఫీపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్ వద్ద తమ సమస్యలు చెప్పకుంటున్న రైతులు

నల్లగొండ : కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి రెవెన్యూ, రుణమాఫీ సమస్యలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. బాధితులు భారీగా తరలిరావడంతో కలెక్టరేట్ మీటింగ్ హాల్‌తోపాటు బయట ఆవరణ అంతా జనంతో నిండిపోయింది. మొత్తం 96 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో భూస మ్యలకు సంబంధించి 53.. ఇతర అంశాలవి 43 ఫిర్యాదులు ఉన్నాయి. రుణమాఫీ కాలేదంటూ సుమారు వంద మంది రైతులు అర్జీలు అందజే శారు. ప్రజల నుంచి కలెక్టర్ నారాయణరెడ్డి, అద నపు కలెక్టర్లు వినతులు స్వీకరించి ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

రుణమాఫీ ఎందుకు కాలేదు..!

ఇటీవల ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీకి సం బంధించి మొదటి విడత లక్ష రూపాయల రుణమా ఫీ చేసింది. చాలా మంది రైతులకు రుణమాఫీ కాక పోవడం, ఆ విషయంలో బ్యాంకర్ల నుంచి సరైన సమాధానం రాకపోవడం వారిలో చాలా మంది కలె క్టరేట్‌లో గ్రీవెన్స్‌కు వచ్చారు. రైతులు పెద్ద సం ఖ్యలో తరలిరావడంతో రుణమాఫీపై ఫిర్యాదుల స్వీకరణ కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. అక్కడ అధికారులు ఫిర్యాదుల స్వీకరణతోపాటు ఆన్‌లైన్‌లో రైతులకు ఆధార్ కార్డుల ఆధారంగా రుణమాఫీ అయిందా కాలేదా అన్న విషయాలను వివరించారు. రుణమాఫీకి సంబంధించి దాదాపు 100 మందికిపైగా రైతులు తమకు రుణమాఫీ కాలే దని ఫిర్యాదులు అందించారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి

జిల్లా అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. ప్రజావాణి సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడారు. అధికారులు సమయపాలన పాటించాలని, పనిలో నాణ్యత ఉండాలని సూచించారు. రెగ్యులర్ పనులతో పాటు, ప్రభుత్వ ప్రాధాన్య పథ కాల అమలులో జాప్యం చేయొద్దన్నారు. జిల్లా అధికారులు కిందిస్థాయి సిబ్బందికి ఆదర్శంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. మండల, గ్రామస్థాయి ప్రజావాణి ఫిర్యాదులను కూడా వెంటవెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుపై బాధితుడికి స్పష్టంగా తెలియజే యాలని, ఒకవేళ ఆ పిర్యాదు పరిష్కారం కాక పోతే అందుకు గల కారణాలను తెలియజే యాలని సూచించారు. కార్యక్రమంలో అద నపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్‌ఓ డి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఫిర్యాదులపై సమగ్ర దర్యాప్తు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండక్రైం : గ్రీవెన్స్‌డేలో వచ్చిన ఫిర్యాదు లపై సమగ్ర విచారణ చేసి బాధితులకు భరోసా కల్పించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమ వారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 70 మంది ఫిర్యాదులు అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో విచారిం చి చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు భరోసా కల్పించాలన్నారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే 8712670426 నంబర్‌కు వాట్సప్ చేయాలని తెలిపారు.

నేటి నుంచి ఆసరా పింఛన్ల పంపిణీ

నల్లగొండ : ఆసరా పింఛన్లను ఈనెల 23వ తేదీ నుంచి 29వ తేదీ వరకు పంపిణీ చేయను న్నట్లు డీఆర్‌డీఓ నాగిరెడ్డి సోమవారం ఒక ప్రక టనలో తెలిపారు. పింఛన్‌దారులు ఆయా పోస్టాఫీస్‌ల ద్వారా పింఛన్ పొందాలని సూచిం చారు. పోస్టాఫీస్‌లలో సిబ్బంది ఎవరైనా చిల్లర ఇవ్వకపోతే డీఆర్‌డీఏ కార్యాలయంలో నేరుగా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

ఎంజీయూ డిగ్రీ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ నవీన్ మిట్టల్

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివ ర్సిటీ డిగ్రీ పరీక్షల ఫలితాలను సోమవారం హైదరాబాద్‌లో యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ నవీన్‌మిట్టల్.. రిజిస్ట్రార్ అల్వాల రవి, పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి, అడ్మిషన్స్ డైరెక్టర్ ఆకుల రవితో కలిసి విడుదల చేశారు. దాంతోపాటు జూన్ 15న నిర్వహించిన పీహె చ్‌డీ ప్రవేశపరీక్ష ఫలితాలను కూడా విడుదల చేశారు. యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ ఫలితాల్లో మొత్తం 8,118 మంది విద్యార్థులకు గాను 3493 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలి తాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచారు.

పంచాయతీ కార్యదర్శులకు మెమోలు

కొండమల్లేపల్లి : మండలంలోని ముగ్గురు పం చాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ రాంరెడ్డి సోమవారం మెమోలు జారీ చేశారు. మండ లంలోని జానిగానితండా వన నర్సరీలో మొక్కలు ఎండిపోవడంతో ఈనెల 14న 'సాక్షి' ప్రచురించిన కథనానికి స్పందించిన ఎంపీడీఓ సదరు పంచాయతీ కార్యదర్శులకు మెమోలు జారీ చేశారు.


10.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం

నల్లగొండ టౌన్ : అల్పపీడనం కారణంగా జిల్లాలో 10.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఆదివారం ఉదయం నుంచి సోమ వారం ఉదయం వరకు అత్యధికంగా శాలిగౌరారంలో 49.5 మి.మీ, అత్యల్పంగా గట్టుప్పల్‌లో 5.0 మి.మీ వర్షం కురిసింది. మం డలాల వారీగా చిట్యాల 14.7మి.మీ, చం దూరు 13.4, మిర్యాలగూడ 12.7, తిప్పర్తి 12.5, మాడుగులపల్లి 11.8, తిరుమలగిరిసా గర్ 11.6, వేములపల్లి 11.1, మర్రిగూడ 11.1, కనగల్ 11.0, మునుగోడు 10.6, నాం పల్లి 10.6, నకిరేకల్ 10.4, త్రిపురారం 10.4, గుర్రంపోడు 9.9, నిడమనూరు 9.8, నల్లగొం డ 9.5, దామరచర్ల 9.5, అనుముల 8.8, కట్టం గూరు 8.7 నార్కట్‌పల్లి 8.6, అడవిదేవులపల్లి 8.3, పెద్దవూర 8.0, చింతపల్లి 7.8, గుండ్లపల్లి 7.7, దేవరకొండ 7.5, కేతేపల్లి 7.1, కొండమ ల్లేపల్లి 7.0, పీఏపల్లి 6.4, చండూర్ పేట 5.1, నేరె డుగొమ్ములో 5.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్ష

నల్లగొండ : డీఎస్సీ పరీక్ష సోమవారం ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రశాంతంగా జరిగింది. మొదటి షిఫ్టులో 185 మంది అభ్య ర్థులకు గాను 174 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజర్ అయ్యారు. రెండో షిఫ్టులో 185 మంది అభ్యర్థులకు 175 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజర్ అయ్యారు.

నేడు హాలియా మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్



హాలియా మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య అధ్వానంగా ఉందా..ఓపెన్ ప్లాట్లు, ఖాళీ స్థలాలు చెత్తా చెదారంతో నిండుకుపోయాయా.. డ్రెయినేజీలు, రోడ్లు సరిగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా.. .అయితే మీ సమస్యలపై నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయండి. మున్సిపల్ కమిషనర్‌తో మంగళవారం 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది.



మున్వర్ అలీ, మున్సిపల్ కమిషనర్

తేది. 23.07.2024 మంగళవారం
సమయం : ఉదయం 10.00 నుంచి 11.00 గంటల వరకు

డయల్ చేయాల్సిన ఫోన్ నంబర్ :
96765 19557

బైపాస్ నిర్మాణానికి టెండర్లు పిలవాలని వినతి

నల్లగొండ : నల్లగొండ బైపాస్ రోడ్డు నిర్మాణం త్వర గా చేపట్టేందుకు ఎస్‌ఎఫ్‌సీ (స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ) సమావేశం ఏర్పాటు చేసి టెండర్లు పిలువాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం జాతీయ రోడ్డు రవాణా, జాతీయ రహదారుల (మోర్త్) శాఖ కార్యదర్శి అనురాగ్‌జైన్‌ను ఢిల్లీలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ నల్లగొండ బైపాస్ రోడ్డు నిర్మాణానికి వారంలోగా టెండర్లు పిలిచేందుకు చర్యలు తీసు కోవాలని కోరగా అందుకు అనురాగ్‌జైన్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.



జాతీయ రహదారుల శాఖ కార్యదర్శిని కలిసి జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

ఉదయ సముద్రానికి నీటి విడుదల



ఏకేబీఆర్ నుంచి ఉదయ సముద్రానికి విడుదలవుతున్న నీరు

పెద్దఅడిశర్లపల్లి : నల్లగొండ పట్టణవాసుల దాహార్తి తీర్చేందుకుగాను పానగల్లు ఉదయ సముద్రానికి ఏఎమ్మార్పీ ప్రధాన కాలువ ద్వారా సోమవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఎమ్మా ర్పీ ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఏకేబీఆర్‌లో 0.13 టీఎంసీ నీరు మాత్రమే ఉండడం తో నల్లగొండకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని.. ఏకేబీఆర్ నీటిమట్టం పెరిగిన తర్వాత నీటి విడుదలను పెంచుతామని తెలిపారు. ఎమర్జెన్సీ మోటార్ల ద్వారా 800 క్యూసెక్కుల నీటిని ఏకేబీఆర్‌కు పంపుతుండగా అక్కడి నుండి జంటన గరాలకు 525 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 45 క్యూసెక్కులు, డి-7 కు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. లింక్ కెనాల్‌లో నీటి చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చ రించారు. కార్యక్రమంలో ఈఈ సత్యనారాయణ, డీఈలు చక్రపాణి, నాగయ్య, ఏఈ శ్రావణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం

- కలెక్టర్‌కు నోటీసు అందజేసిన 14 మంది కౌన్సిలర్లు



కలెక్టర్ నారాయణరెడ్డికి నోటీసు అందజేస్తున్న నకిరేకల్ కాంగ్రెస్ కౌన్సిలర్లు

నకిరేకల్ : నకిరేకల్ మున్సిపాలిటీ చైర్మన్ (బీఆర్ ఎస్)పై అవిశ్వాస తీర్మానం కోరుతూ సోమవారం సాయంత్రం కలెక్టర్ నారాయణరెడ్డికి కౌన్సిలర్లు నోటీసు అందజేశారు. పట్టణంలో 20 మంది కౌన్సిలర్లకు గాను 14 మంది కౌన్సిలర్ల ఆ నోటీస్‌పై సంతకాలు చేశారు. 2021 మేలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 20 వార్డులకు గాను 11 వార్డులు బీఆర్ ఎస్ పార్టీ, రెండు కాంగ్రెస్, ఒకటి ఇండిపెండెంట్, ఆరు వార్డులు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి గెలుపొందాయి. మెజార్టీ స్థానాలు గెలిచిన బీఆర్ ఎస్ పార్టీ చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలను దక్కించు కుంది. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ బలం 12కు చేరింది. కాంగ్రెస్ నుంచి ఎమ్మె ల్యేగా గెలిచిన వేముల వీరేశం మున్సిపాలిటీ చైర్మన్ స్థానాన్ని దక్కించుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. దీంతో ఇప్పటికే కాంగ్రెస్ వైపు ఉన్న 12 మం దితోపాటు మరో ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాం గ్రెస్ వైపు వచ్చేందుకు సిద్ధం కావడంతో 14 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన నోటీసును కలెక్టర్‌కు అందజేశారు. అవిశ్వాస తీర్మాన నోటీస్‌పై సంత కాలు చేసిన వారిలో వైస్ చైర్ పర్సన్ మురారిశెట్టి ఉమారాణి, కౌన్సిలర్లు కందాల భిక్షంరెడ్డి, గాజుల సుకన్య, చౌగోని రజిత, చౌగోని రాములమ్మ, పన్నాల పావని, యాసారం లక్ష్మి, వంటెపాక సోమ లక్ష్మి, బానోతు వెంకన్న, దైద స్వప్న, గడ్డం స్వామి, గర్శకోటి సైదులు, మట్టిపల్లి కవిత, చౌగోని అఖిల ఉన్నారు.

మొక్కలను నాటాలి.. సంరక్షించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : అధికారులు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని కలెక్టర్ సి.నారాయ ణరెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వ హించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ శాఖల అధికారులు ఆయా కార్యాలయా లు, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటడం తో పాటు నీటిని పోసి సంరక్షించాలని సూచిం చారు. ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టాలన్నారు. రుణమాఫీ జమకాని రైతుల అకౌంట్లపై ప్రత్యేక దృ ష్టి సారించి త్వరగా జమయ్యేలా చర్యలు తీసు కోవాలన్నారు. అనంతరం టీఎస్ ఐపాస్, టీప్రైడ్ కింద పరిశ్రమల ఏర్పాటు, సబ్సిడీపై వాహనాల అనుమతికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అను మతి ఇచ్చారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్‌ఓ రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

రైల్వే అండర్‌బ్రిడ్జిల వద్ద అప్రమత్తంగా ఉండాలి

నల్లగొండ క్రైం : వర్షాల కారణంగా రైల్వే అం డర్ బ్రిడ్జిల కింద నీరు నిలిచే అవకాశం ఉన్నం దున వాహనదారులు అప్రమత్తంగా ఉండా లని రైల్వే గుంటూరు డివిజన్ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వరదల సమయంలో వాహనాలను నిలివేయ డానికి అండర్ బ్రిడ్జిల వద్ద వాచ్‌మెన్లను నియ మించినట్లు తెలిపారు. 50 సెంటీమీటర్ల నీరు నిలిచినప్పుడు రెడ్ గుర్తులో మార్కు చేసి వాహ నదారులను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. రెడ్ మార్కు ఉంటే అండర్ బ్రిడ్జి నుంచి వాహన దారులు ప్రవేశించవద్దని సూచించారు. అండర్ బ్రిడ్జిల వద్ద రైల్వే అధికారులు, నిలిచిన నీటిని పంపింగ్ చేసే కాంట్రాక్టర్ ఫోన్ నంబర్లు డిస్‌ప్లే చేసినట్లు తెలిపారు. వరద సంభవించినప్పుడు నీటిని పంపింగ్ చేసేంత వరకు అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలు నిలిపివేస్తున్నామని అం దుకు సహకరించాలని కోరారు. మొత్తం 188 అండర్ బ్రిడ్జిల్లో 14 చోట్ల నీరు నిలిచే అవకాశం ఉందని తెలిపారు.

యాదాద్రిలో ఆధ్యాత్మిక పర్వాలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో సోమవారం ఆధ్యా త్మిక పర్వాలు కొనసాగాయి. కొండపైన ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో రుద్రాభిషేకం, బిల్వార్చన చేశారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలు నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవ, ఆరాధన, నిజాభి షేకం, తులసీదళ అర్చన చేపట్టారు. అనం తరం ఆలయ ప్రాకార మండపం, ముఖ మం డపంలో శ్రీసుదర్శన హోమం, నిత్యకల్యాణం , జోడు సేవోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. రాత్రి స్వామి, అమ్మవారికి శయ నోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.

మూసీ ప్రాజెక్టును ఆధునీకరించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి
- బొప్పారం నుంచి కేతేపల్లి వరకు పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న సీపీఎం నాయకులు

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టును ఆధునీకరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పోరుబాట పట్టింది. సోమ వారం కేతేపల్లి మండలంలోని బొప్పారం గ్రామం నుంచి కేతేపల్లి వరకు ఆ పార్టీ నాయకులు రైతుల తో కలిసి పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రను బొప్పారం గ్రామం వద్ద సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ప్రారంభించారు. బొప్పారం గ్రామంలో ప్రారంభమైన పాదయాత్ర కాసనగోడు, గుడివాడ, ఇప్పలగూడెం, కొర్లపహాడ్ గ్రామాల మీదుగా కేతేపల్లికి చేరుకుంది. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రం గారెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత అతిపెద్ద సాగునీటి వనరు గా ఉన్న మూసీ ప్రాజెక్టు ఆధునికీరణకు ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.లక్ష కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. 35వేల ఎకరాలకు నీరందించే మూసీ ప్రాజెక్టు నిర్వహణలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తున్నాయన్నారు. మూసీ ప్రాజెక్టులో పూడికను తొలగించకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయి చివర భూములకు సాగునీరు అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ వద్ద ఉన్న గురుకుల పాఠశాలను పీజీ వరకు అప్‌గ్రేడ్ చేయాల న్నారు. మూసీ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించని పక్షంలో రైతులతో కలసి ఉద్యమాలకు సిద్ధమవుతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కందాల ప్రమీల, బొజ్జ చినవెంకులు, రాచకొండ వెంకన్న, సీహెచ్.లూర్దుమారయ్య, ఎల్.రాజు, కుమ్మరి శంక ర్, కోట లింగయ్య, అల్లి ప్రభాకర్, కేశవులు, వం గూరి వెంకన్న, నీలం సైదులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి, పాల్గొన్న సీఐటీయూ నాయకులు, ఆశ వర్కర్లు

నల్లగొండ టౌన్ : ఆశా వర్కర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యకుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వ హించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశ వర్కర్లకు రూ.50 లక్షల బీమా అమలు చేయాలని, రూ.18 వేల కనీస వేత నానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. ఎన్నికల విధులు నిర్వహించిన వారికి డబ్బులు వెం టనే చెల్లించాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయ ణ, మహేశ్వరి, వెంకటమ్మ, సలీం, సత్తయ్య, యా దయ్య, నర్సింహ, సత్యనారాయణ, ముత్యాలు, కవిత, వసంత, పార్వతమ్మ, అనూష, పద్మ, విమల, సునీత, నిర్మల, జయమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.

పత్తి చేలకు మేలు

- వర్షంతో జీవం పోసుకున్న మొక్కలు
- కలుపు తీసి ఎరువులు వేసుకునేందుకు సిద్ధమవుతున్న రైతులు



నల్లగొండ అగ్రికల్చర్ : అల్పపీడన ద్రోణి కారణం గా జిల్లాలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షం పత్తి రైతులకు మేలు చేసింది. ఇరువై రోజులుగా జిల్లాలో వర్షాలు కురవకపోవడంతో పత్తి చేలు పూర్తిగా వాడుపట్టి ఎండిపోయే పరిస్థితి చేరుకు న్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ పెట్టుబడులు కూడా చేతికి వచ్చే అవకాశం లేకుం డా పోతోందని ఆవేదన చెందారు. నాలుగు రోజులుగా ముసురుతో కూడిన వర్షం కురవడంతో వాడుపట్టిన పత్తి చేలకు జీవం పోసినట్లు అయ్యిం ది. వరుసగా వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలోని పత్తిచేలు ఏపుగా పెరుగుతున్నాయి. ఇలా వారాని కోసారి వర్షం కురిస్తే పత్తి చేలకు డోకా ఉండదనే అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పత్తి చేలు కొన్ని ప్రాంతాల్లో మూరెడు ఎత్తులో ఉండగా నకిరేకల్, మునుగోలు, హాలియా ప్రాంతాల్లో పూతకు వచ్చేదశలో ఉన్నాయి. వాతావ రణం అనుకూలించి సరైన వర్షాలు పడితే పత్తి రైతు లకు మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుం దని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

ఈ ఏడాది తగ్గిన సాగు..

జిల్లాలో ఈ సారి 6.40 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తారని వ్యవసాయశాఖ అంచనాలు వేసిం ది. కానీ మొదట్లో వరుణుడు కరుణించని కారణం గా జిల్లాలో కేవలం 3,46,790 ఎకరాల్లో మాత్రమే రైతులు పత్తి సాగు చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఆగిపోతే రైతులు వెంటనే పత్తి చేలలో కలుపుతీసుకుని, ఎరువులు పెట్టుకునేందుకు సిద్ధమ వుతున్నారు. ఇప్పటికే ఇరువై రోజుల క్రితం ఒకసారి రైతులు కలుపు తీసుకుని ఎరువులను పెట్టుకున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షం పత్తిచేలకు మంచి పదును ఇవ్వడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మంచి వర్షం కురిసింది



నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా ముసు రుతో కూడిన వర్షం కురిసింది. ఇప్పటికే జిల్లాలో 2 లక్షల ఎక రాలకు సరిపడా వరినార్లు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రాజె క్టులకు వరదనీరు వస్తున్న నేపథ్యంలో వరినాట్లు వేసుకునే అవకాశం ఉంటుంది. ఆయకట్టు కింద వరినార్లు పోసుకునే అవ కాశం ఉంది. ఆగస్టు చివరి వరకు వరినాట్లు వేసుకుంటారు. పత్తి చేలకు కూడా మంచి పదునైంది. రైతులు పత్తిలో కలుపుతీసుకుని ఎరువులు పెట్టుకోవాలి.

- పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ

క్లుప్తంగా

మూసీ ప్రాజెక్టుకు 3,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు సోమవారం ఇన్‌ఫ్లో పెరిగింది. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ గేట్లు ఎత్తడంతో పాటు మూసీ ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టుకు వరద ఎక్కువైంది. ఆదివారం 2050 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో.. సోమవారం 3,200 క్యూసెక్కులకు పెరిగింది. మూసీ పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 640.70 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.35 టీఎంసీల నీరు నిల్వ ఉంది. భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మరో మూడు రోజులు కొనసాగితే ప్రాజెక్టు గేట్లు ఎత్తే అవకాశముంది.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

చింతపల్లి: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం చింతపల్లి మండల కేంద్రంలో జరిగింది. ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండల కేంద్రానికి చెందిన పేర్ల వెంకట్‌రెడ్డి (51) స్థానికంగా మోటారు మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి తాను పనిచేస్తున్న షాపులోనే వైరుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పుల బాధ తట్టుకోలేకే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



చిట్యాల, నార్కట్‌పల్లి: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లి సమీపంలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. చిట్యాల నుంచి నార్కట్‌పల్లి రైల్వే మార్గంలో 55/13 కి.మీ. మైలురాయి వద్ద సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న చిట్యాల రైల్వే స్టేషన్ మాస్టర్ నల్లగొండ రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు 40 నుంచి 50 ఏళ్ల వయస్సు కల్గి ఉంటాడని, నలుపు రంగు ప్యాంట్, బూడిద రంగు షర్ట్ ధరించి ఉన్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తికి జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ), తిరుమలగిరి: కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఆరు నెలలు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ నల్లగొండ ఎస్సీ, ఎస్టీ సెషన్స్ కోర్టు జడ్జి ఎన్. రోజారమణి సోమవారం తీర్పు వెలువరించారు. తిరుమలగిరి ఎస్‌ఐ కె. సత్యనారాయణగౌడ్, ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల ప్రకారం.. 2018 ఫిబ్రవరి 21వ తేదీన సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన లకావత్ రాజేరి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో కొండా మధు ఆమె వద్దకు వచ్చి గతంలో తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని ఆమెను కులం పేరుతో దూషించాడు. ఆమెపై దాడి చేసి చంపుతానని బెదిరించాడు. ఈ విషయాన్ని రాజేరి కుటుంబ సభ్యులకు తెలియజేసింది. రాజేరి కుటుంబ సభ్యులు తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో మధుపై ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు మధును కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ దర్శనం నర్సింహ వాదనలతో ఏకీభవించిన నల్లగొండ ఎస్సీ, ఎస్టీ సెషన్స్ కోర్టు జడ్జి నిందితుడికి 6నెలల జైలుశిక్ష, రూ.3000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

వరద నీటిని ఒడిసిపట్టేందుకు సిద్ధం

- పూర్తయిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వే మరమ్మతు పనులు
- రేడియల్ క్రస్ట్ గేట్లకు సర్వీసింగ్ పూర్తి



పూర్తయిన స్పిల్‌వే మరమ్మతు పనులు



గేట్లు ఎత్తేందుకు ఉపయోగపడే బేరింగ్ ఇరుసులకు గ్రీజింగ్ చేస్తున్న సిబ్బంది

నాగార్జునసాగర్: కృష్ణా నది పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వరద నీరు భారీగా ప్రాజెక్టులకు వస్తోంది. దీంతో అప్రమత్తమైన నాగార్జునసాగర్ ప్రాజెక్టు అధికారులు జలాశయంలో నీటిని నింపేందుకు అంతా సిద్ధం చేస్తున్నారు. పదేళ్ల క్రితం నాగార్జునసాగర్ డ్యాం స్పిల్‌వే దెబ్బతినగా పలుమార్లు టెండర్లు పిలిచి చివరగా రూ.16కోట్లకు ఓ కంపెనీకి పనులు అప్పగించారు. గతేడాది నుంచి వర్షాలు లేకపోవడంతో స్పిల్ వే పనులు పూర్తి చేశారు. వీటితో పాటు స్లూయిస్ గేట్లు, కుడి, ఎడమ కాల్వల హెడ్ రెగ్యులేటర్ గేట్లు కొత్తవి పెట్టించారు.

పూర్తయిన సర్వీసింగ్ పనులు

గత నెలరోజులుగా ప్రాజెక్టుకు గల 26 రేడియల్ క్రస్ట్ గేట్లకు సర్వీసింగ్ పనులు పూర్తిచేశారు. ఒక్కో గేటు పూర్తిగా ఎత్తేందుకు 45నిమిషాలు సమయం పడుతోంది. అలాగే దింపేందుకు అంతే సమయం పడుతోంది. గేట్ల సందులో నుంచి నీరు బయటకు లీకు కాకుండా ఇప్పటికే గేట్లకు ఇరువైపులా రబ్బర్లు వేశారు. గేట్లకు అనుసంధానంగా ఉన్న రోప్‌కు గ్రీజింగ్ చేయడం, మోటార్లకు అనుసంధానంగా ఉన్న గేర్స్‌కు పూర్తిస్థాయిలో ఆయిల్ మార్చడం పనులు పూర్తి చేశారు. హైమాస్ట్ రేడియల్ క్రస్ట్‌గేట్లపై గల స్టార్టర్లు, మోటార్లలో వీక్‌గా గల మ్యాగ్నెట్స్‌ను కూడా మార్చారు. క్యాడింగ్ కాంపౌండ్ పనులు పూర్తి చేశారు.

ఎట్టకేలకు ఆటోమిషన్ వినియోగంలోకి..

గత మూడేళ్లుగా పనిచేయకుండా పోయిన ఆటోమిషన్‌ను వినియోగంలోకి తెచ్చారు. ఆటోమిషన్‌ను ఆన్‌లైన్‌కు అనుసంధానంగా ఉంటుంది. దీంతో ఏ గేటు ద్వారా ఎంతనీరు వెళ్తుందో క్యూసెక్కులు, టీఎంసీల రూపంలో ఎప్పటికప్పుడు నమోదవుతుంది. గతంలో నీరు ఎంత విడుదల చేయాలో తెలుసుకుని గేటు ఎంత ఎత్తు ఎత్తితే ఎంతనీరు వెళ్తుందో లెక్కలేసుకోని గేట్లు ఎత్తేవారు. ఇప్పుడు ఆటోమిషన్ సౌకర్యంతో ఎంత నీరు వెళ్లాలో ఫీడ్ చేసి రిమోట్‌తో ఆన్ చేస్తే గేటు పైకి లేచి అంతనీరు బయటకు పోతుంది. ఇదంతా దృశ్య రూపంలో మనకు స్క్రీన్‌పై కనపడుతుంది.

జాలు నీటి రంధ్రాల్లో పేరుకుపోతున్న కాల్షియం

కృష్ణా జలాల్లో కాల్షియం అధికం. ఇది నీటితోపాటు డ్యాం గోడల్లోకి వెళ్తుంది. దీనిని ఎప్పటికప్పుడు తొలగించడానికి డ్యాం అంతర్భాగంలోని గ్యాలరీలలో డ్యాం గోడలకు రంధ్రాలు ఏర్పాటు చేశారు. డ్యాం గోడల ద్వారా వచ్చిన ఊట నీరు ఈ రంధ్రాల ద్వారా బయటకు వెళ్లిపోతుంది. డ్యాం గోడలోకి వచ్చే ఊట నీటిని ఎప్పటికప్పుడు తొలగించడం ద్వారా డ్యాం గోడల్లో కాల్షియం పేరుకపోకుండా నివారించడానికి వీలుంటుంది. ఈ రంధ్రాలలో కాల్షియం పేరుకపోతే ఊటనీరు రంధ్రాల్లోకి రాకుండా డ్యాం గోడల్లోకి వెళ్తాయి. ఊట నీటితో పాటు కాల్షియం కూడా డ్యాం గోడల్లోకి వెళ్తే గోడలకు పగుళ్లు పడే ప్రమాదం ఉంది. దీంతో ఊటనీరు పెరిగే అవకాశం ఉంది. ఈ కారణంగా డ్యాం ఉనికికే ప్రమాదం వచ్చే అవకాశం ఉండడంతో, డ్యాం రంధ్రాలలో పేరుకుపోయిన కాల్షియాన్ని ప్రతి సంవత్సరం తొలిగించాల్సి ఉంటుంది. అందుకుగాను ప్రత్యేక యంత్రాలు ఉపయోగించాల్సి ఉంటుంది. 20 ఏళ్ల క్రితం కాల్షియం తొలగించారు. మళ్లీ ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అధికార యంత్రాంగం దీనిపై దృష్టిపెట్టాలని నిపుణులు పేర్కొంటున్నారు.

ముగ్గురు మహిళల ఆత్మహత్యాయత్నం

- భూమి కబ్జా చేసి అక్రమంగా పట్టా చేయించుకున్నారని ఆవేదన
- సూర్యాపేట కలెక్టరేట్‌లో కలకలం



మహిళల నుంచి పెట్రోల్ క్యాన్ లాక్కుంటున్న పోలీసు, సెక్యూరిటీ సిబ్బంది

భానుపురి (సూర్యాపేట): తమ భూమని కబ్జా చేసి అక్రమంగా పట్టా చేయించుకున్నారని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడంలేదన్న ఆవేదనతో ముగ్గురు మహిళలు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించారు. ఈ ఘటన సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన మేడం ముత్తయ్యకు ఏడుగురు సంతానం. ఆయనకు అదే గ్రామంలో 9 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా మొదటి ముగ్గురు కుమారులకు ఒక్కొక్కరికి ఎకరం 20 గుంటల చొప్పున పట్టా చేయించాడు. మిగిలిన 4.20 ఎకరాల భూమి తన పేరునే ఉంచుకున్నారు. ఈ భూమిలోని 2.20 ఎకరాలు 190 సర్వే నంబర్‌లో, మిగతా భూమి మరో సర్వే నంబర్‌లో ఉంది. 190 సర్వే నంబర్‌లోని రెండున్నర ఎకరాల భూమి 2015వ సంవత్సరం వరకు పహాణీలో మేడం ముత్తయ్య పేరు మీద నమోదై ఉంది. ఎరుకల కులానికి చెందిన వీరంతా చెన్నై ప్రాంతానికి వెళ్లి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే గ్రామానికి చెందిన భూతరాజు రామారావు, భూతరాజు బాజీ సర్వే నంబర్ 190లోని రెండున్నర ఎకరాల భూమిని కబ్జా చేసి 2016లో అక్రమంగా పట్టా చేయించుకున్నారని, ఈ విషయమై పలుమార్లు మండల అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి మేడం ముత్తయ్య చిన్న కోడలు లక్ష్మమ్మ, మూడో కుమారుడు రాములు కుమార్తె పుల్లమ్మ, రాములు కోడలు అరుణ వచ్చారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరానికి సమీపంలో వారు ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. ఈ విషయాన్ని గమనించిన పోలీసులు వెంటనే పెట్రోల్ క్యాన్‌ను లాక్కొని బాధితులను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నా న్యాయం జరగడంలేదని మహిళలు వాపోయారు. మహిళల సమస్యను విన్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు.

చీడపీడలపై అవగాహన కలిగి ఉండాలి



డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

త్రిపురారం: పంటల సాగులో చీడపీడలపై డీలర్లు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ వరి పరిశోధనా స్థానం కంపాసాగర్ హెడ్ డాక్టర్ లింగయ్య అన్నారు. సోమవారం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కంపాసాగర్‌లో జిల్లాలోని ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్లకు దేశీ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా పంటల సాగులో వచ్చే చీడపీడల గుర్తింపు, తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం త్రిపురారం మండలం నీలాయిగూడెంలో రైతులు కంచి సోమయ్య, చక్రవర్తి, రెడ్డి ప్రసాద్ సీడ్ డ్రిల్ సహాయంతో సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ లింగయ్య మాట్లాడుతూ.. రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు కృషి చేయాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకునే విధంగా డీలర్లు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కేవీకే సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్, విస్తరణ శాస్త్రవేత్త పల్లవి, దేశీ ప్రోగ్రాం ఫెసిలిటేటర్ కృష్ణయ్య, రైతులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం



విద్యార్థినులతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు రానున్న బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఆయన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించారు. తరగతి గదులు, హాస్టల్ గదులు, బాత్‌రూంలు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థినులతో ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అదేవిధంగా అంతరిక్ష ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన స్పేస్ ఆన్ వీల్స్ ఎగ్జిబిషన్‌ను విద్యార్థులతో కలిసి తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం ఇచ్చే మెస్ చార్జీలను పెంచే విధంగా కృషి చేస్తానన్నారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యను వివరిస్తానన్నారు. 11ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన గురుకులంలో సమస్యలన్నీ పరిష్కరిస్తానన్నారు. విద్యార్థులు పాఠశాల దశలోనే అంతరిక్ష ప్రయోగాలు, అంతరిక్షంపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరనాయక్, మాజీ ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సరోజమ్మ, ఎస్‌ఎంసీ చైర్మన్ చింతల సాయిలు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బతండాలో విషాదఛాయలు

- ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న బాలిక అంత్యక్రియలు పూర్తి



రాజేశ్వరి (ఫైల్)

నాగారం: ప్రేమ పేరుతో వేధింపులు తట్టుకోలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న నాగారం మండలం నర్సింహులగూడెం ఆవాసం దుబ్బతండాకు చెందిన బాలిక అంత్యక్రియలు సోమవారం తండాలో నిర్వహించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. దుబ్బతండాకు చెందని ధరావత్ రమేష్, సోనా దంపతులకు రాజేశ్వరి(17), రాజేష్ సంతానం. పిల్లల ఉన్నత చదువుల కోసం వారు హైదరాబాద్‌కు వలస వెళ్లి బోడుప్పల్‌లో నివాసం ఉంటున్నారు. రమేష్ వాచ్‌మెన్‌గా, సోనా ఇళ్లల్లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రాజేశ్వరి ఇంటర్ చదువుతోంది. రాజేశ్వరి అమ్మమ్మ ఊరైన భువనగిరి సమీపంలోని పిల్లికుంట్లతండాకు చెందిన యువకుడు ప్రేమ పేరుతో రాజేశ్వరిని వేధిస్తుండటంతో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హైదరాబాద్‌లో పోస్టుమార్టం అనంతరం బాలిక మృతదేహాన్ని సోమవారం దుబ్బ తండాకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

రైస్ మిల్లుల్లో తనిఖీలు

నేరేడుచర్ల: మండలంలోని ముకుందాపురం గ్రామంలో గల సోమేశ్వర రైస్ మిల్లు, నేరేడుచర్లలోని తిరుమల రైస్ మిల్లులో సోమవారం హుజూర్‌నగర్ ఆర్డీఓ వి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గతంలో ప్రభుత్వం ఈ రెండు మిల్లులకు సీఎంఆర్ ధాన్యాన్ని కేటాయించింది. ప్రస్తుతం గతంలో కేటాయించిన ధాన్యం రైస్ మిల్లుల్లో ఉన్నాయా..? లేవా అని అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆయా రైస్ మిల్లుల్లో ప్రభుత్వం గతంలో కేటాయించిన ధాన్యం కంటే తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కానీ ఎంత వ్యత్యాసం ఉందనేది అధికారులు పూర్తిగా సమాచారం అందించడం లేదు. ఈ తనిఖీల్లో హుజూర్‌నగర్ సీఐ చరమందరాజుతో పాటు జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ రాములు, నేరేడుచర్ల తహసీల్దార్ సైదులు, డిప్యూటీ తహసీల్దార్ కమలాకర్, నరేందర్, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, ఆర్‌ఐ నర్సయ్య తదితరులున్నారు.



నేరేడుచర్ల గ్రామ శివారులోని రైస్ మిల్లు ఆవరణలో ధాన్యాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ఆలేరు రూరల్: షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైంది. ఈ ఘటన ఆలేరు మండలం మందనపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తులు, రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మందనపల్లి గ్రామానికి చెందిన జువగాని భాస్కర్ కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం కూలి పనికి వెళ్లగా.. వారు ఉంటున్న పెంకుటిల్లు చుట్టూ దట్టంగా మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు గమనించి నీళ్లతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని బీరువా, టీవీ, ఫ్రిజ్, రూ.45వేల నగదు, పట్టా గొలుసులతో పాటు తన కుమార్తె పెళ్లి కోసం తెచ్చి పెట్టుకున్న సామాగ్రి, దుస్తులు, గృహోపకరణాలు, విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలిపోవడంతో మంటల తీవ్రత ఎక్కువగా ఉందని బాధితుడు వాపోయాడు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి పెంకుటిల్లు గోడలకు నిమ్ము వచ్చి షార్ట్ సర్క్యూట్ అయ్యి ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు. రెవెన్యూ అధికారులు వచ్చి పంచనామా చేశారు. భాస్కర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని కోనమేకలవారిగూడెం గ్రామ స్టేజీ వద్ద కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వాకిటి అజయ్(21) సోమవారం సాయంత్రం మృతిచెందాడు. బైక్‌పై వెళ్తూ బస్సును వెనుక నుంచి ఢీకొట్టడంతో బైక్ నడుపుతున్న తిరుమలగిరి(సాగర్) మండలం అల్వాలకు చెందిన లింగంపల్లి కొండల్(19) అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న వాకిటి అజయ్‌కు తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడు కొండల్ తండ్రి లింగంపల్లి యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

గ్రామ పంచాయతీ ట్రాక్టర్ చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ అంతిరెడ్డి

నార్కట్‌పల్లి: మండలంలోని ఏనుగులదోరి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ చోరీ కేసులో ముగ్గురిని నార్కట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నార్కట్‌పల్లి ఎస్‌ఐ అంతిరెడ్డి సోమవారం విలేకరులకు తెలియజేశారు. భువనగిరి మండలం చీమలకొండూర్ గ్రామానికి చెందిన పల్లెర్ల మహేష్ ఈ నెల 8వ తేదీ రాత్రి సమయంలో కారులో నార్కట్‌పల్లి మండలం ఏనుగులదోరి గ్రామానికి వెళ్లగా.. గ్రామ పంచాయతీ భవనం సమీపంలోని నర్సరీ వద్ద పార్కింగ్ చేసిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌కు ఎటువంటి కాపలా లేకపోవడం గమనించాడు. ఈ విషయాన్ని తన స్నేహితులైన చీమలకొండూర్ గ్రామానికే చెందిన పల్లెర్ల కరుణాకర్, ఆత్మకూర్ మండలం రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన కదిరి వెంకటేష్‌కు తెలియజేశాడు. 9వ తేదీ రాత్రి కారులో ముగ్గురూ కలిసి ఏనుగులదోరి గ్రామానికి చేరుకుని ట్రాక్టర్‌ను దొంగిలించారు. నార్కట్‌పల్లిలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో క్యాన్‌లో డీజిల్ పోయించుకుని ఆ డీజిల్‌ను ట్రాక్టర్‌లో పోసి గోపలాయపల్లి గ్రామ శివారులో కంపచెట్ల మధ్యలో ట్రాక్టర్‌ను దాచి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని బోడుప్పల్‌కు వెళ్లిపోయారు. సోమవారం ముగ్గురు కలసి ఏనుగులదోరి గ్రామ చుట్టుపక్కల ఇంకా ఏమైనా ట్రాక్టర్లు చోరీ చేసేందుకు ఉన్నాయా అని చూసేందుకు కారులో హైదరాబాద్ నుంచి నార్కట్‌పల్లికి వస్తుండగా మునుగోడు చౌరస్తాలో పోలీసులు వారిని ఆపి విచారించగా తామే ట్రాక్టర్ చోరీ చేసినట్లు నిజం ఒప్పుకున్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ట్రాక్టర్‌ను దొంగిలించి తక్కువ ధరకు అమ్మి సమాన వాటాలు పంచుకుంటున్నట్లు నిందితులు తెలిపారు. వారిచ్చిన సమాచారం మేరకు ట్రాక్టర్, కారు, డీజిల్ క్యాన్, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు. ఈ కేసును ఛేదించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ నాగరాజు, ఎస్‌ఐ అంతిరెడ్డి, కానిస్టేబుళ్లు గిరిబాబు, శ్రీను, హోంగార్డు రమేష్‌లను ఎస్పీ అభినందించారు.

ఎడమ కాలువ తూముల వద్ద అధికారుల పహారా



తూము వద్ద పహారా కాస్తున్న అధికారులు

నేరేడుచర్ల: కృష్ణానది యాజమాన్య బోర్డు(కేఆర్‌ఎంబీ) సూచనల మేరకు నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా తాగునీటిని ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌కు అధికారుల పహారా మధ్య సరఫరా చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి సాగర్ కుడి కాలువకు 5 టీఎంసీలు, ఎడమ కాలువకు నాలుగున్నర టీఎంసీలు నీటి విడుదల చేయాలని కేఆర్‌ఎంబీ నిర్ణయించిన విషయం తెలిసిందే. సాగర్ ప్రాజెక్టు నుంచి పాలేరు రిజర్వాయర్ వరకు గల తూముల ద్వారా రైతులు నీటిని తరలించకుండా ప్రతి తూము వద్ద గ్రామ కార్యదర్శులు, లష్కర్లు, రెవెన్యూ సిబ్బందిని పహారా ఉంచి నీటిని తరలిస్తున్నారు. ఈ మూడు శాఖల సిబ్బంది రెండు విడతలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కో విడతలో 12గంటల చొప్పున పహారా నిర్వహించేలా ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేశారు. గతంలో కూడా తాగునీటి అవసరాల సాకుతో పాలేరు రిజర్వాయర్‌కే నీటిని తరలించడం పట్ల ఎడమ కాలువ దిగువ రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు గమనించి ఎడమ కాలువ నుంచి కాకుండా మేజర్ కాలువల ద్వారా నీటిని తరలించి తాగునీటి ఎద్దడిని నివారించాలని కోరుతున్నారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హుజూర్‌నగర్ ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఈ ప్రాంతానికి తాగునీటి కోసం స్థానిక కాలువల ద్వారా నీటిని విడుదల చేయకపోవడం బాధాకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. గ్రామ కార్యదర్శులు తూముల వద్ద విధులు నిర్వహిస్తుండటంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారే అవకాశం ఉందని అంటున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడరూరల్: గంజాయి విక్రయిస్తున్న ముఠాను చిలుకూరు మండలం బేతవోలుతో స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను కోదాడ డీఎస్పీ కార్యాలయంలో సోమవారం డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం బేతవోలుకు చెందిన గుండు గోపి, బత్తిని వెంకటేశ్వర్లు, గుండు రాజేష్, కొలిమి శివ, పెన్‌పహాడ్ మండలం మాసారం గ్రామానికి చెందిన బొమ్మకంటి గోపి, పేరం శ్రీకాంత్ స్నేహితులు. వీరంతా గత ఆరునెలలుగా ఒరిస్సా రాష్ట్రం నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. గత నెల 29న ఒరిస్సా సరిహద్దుల్లో బాప అనే వ్యక్తి వద్ద గుండు గోపి, బొమ్మకంటి గోపి రెండున్నర కిలోల గంజాయి కొనుగోలు చేసి బేతవోలుకు తీసుకొచ్చారు. అందులో కేజీ గంజాయిని బొమ్మకంటి గోపి ఇంటికి తీసుకెళ్లగా.. మిగతా కేజిన్నర గంజాయిని గుండు గోపి ఇంట్లో పెట్టి కొంత తాగాడు. మిగిలిన గంజాయిని అమ్ముదామని ఐదుగురు స్నేహితులకు ఫోన్ చేయగా వారు గుండు గోపి ఇంటి వద్దకు రాగానే పక్కా సమాచారం మేరకు పోలీసులు వారిని పట్టుకున్నారు. ఏడుగురు నిందితుల్లో బొమ్మకంటి గోపితో పాటు ఒరిస్సాకు చెందిన బాప పరారీలో ఉండగా.. మిగిలిన ఐదుగురిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి ఒక కేజీ ఎనిమిది గ్రాముల గంజాయితో పాటు రూ.20,600 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కోదాడ రూరల్ ఎస్‌ఐ రజితారెడ్డి, చిలుకూరు ఎస్‌ఐ రాంబాబు, సిబ్బంది వెంకటేశ్వర్లు, వీరస్వామి, నగేష్, తిరపయ్య ఉన్నారు.

హుజూర్‌నగర్‌లో ఆరుగురు..

హుజూర్‌నగర్: గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం లింగగిరి శివారులోని గూబగుట్ట వద్ద సయ్యద్ రహమద్ బాబా అలియాస్ సొహైల్ అనే వ్యక్తి సోమవారం తన స్నేహితులకు గంజాయి అమ్ముతున్నాడనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి షేక్ జహీర్, బాణోతు వెంకటేష్, చింతారెడ్డి సాయికుమార్, జడ లింగస్వామి అలియాస్ దగడ్ సాయి, కాస జయంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 360 గ్రాముల గంజాయి 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా నేరేడుచర్లలో గంజాయి అమ్ముతున్న కేతవత్ నాగేంద్రబాబుతో పాటు బిహార్‌కు చెందిన మరొక వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ ముత్తయ్య, ఏఎస్‌ఐ రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అతికివున్న చేతివేళ్లకు శస్త్రచికిత్స

- విజయవంతంగా వేరు చేసిన ఎయిమ్స్ వైద్య బృందం



శస్త్రచికిత్సకు ముందు



శస్త్రచికిత్స తర్వాత

బీబీనగర్: పుట్టుకతో రెండు చేతివేళ్లు అతుక్కొని పుట్టిన ఓ బాలికకు శస్త్ర చికిత్స నిర్వహించి రెండు వేళ్లను వేరుగా చేసి అరుదైన వైద్యం అందించారు బీబీనగర్ ఎయిమ్స్ వైద్యులు. భువనగిరి పట్టణానికి చెందిన ఐదు సంవత్సరాల బాలికకు పుట్టుకతోనే కుడి చేతిలోని మధ్యలో రెండు వేళ్లు అతుక్కొని ఉన్నాయి. బాలిక తల్లిదండ్రులు ఎయిమ్స్‌లోని ప్లాస్టిక్ సర్జరీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మూలా రోహిత్ బాబును సంప్రదించారు. దీంతో బాలిక చేతి వేళ్లను పరిశీలించిన రోహిత్ బాబు ఈ సంవత్సరం ఏప్రిల్ 23న శస్త్రచికిత్స చేశారు. రక్త నాళాలు, చర్మంతో కలిసి చిక్కుకున్న నరాలను వేరు చేసి వేళ్లపై అదనపు చర్మాన్ని అంటుకట్టారు. అనంతరం మూడు నెలల పాటు బాలికకు సాధారణ ఫిజియోథెరపీని చేస్తూ పరిస్థితిని గమనిస్తూ వచ్చారు. బాలికకు చేసిన సర్జికల్ ఆపరేషన్ విజయవంతం అయినట్లు ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా సోమవారం తెలిపారు. బాలికకు వైద్యం అందించిన వైద్యులను ఆయన అభినందించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

రామన్నపేట : మండలంలోని కుంకుడుపాముల గ్రామంలో ఆదివారం సాయంత్రం విద్యుదాఘాతంతో గేదె మృతిచెందింది. కుంకుడుపాముల గ్రామానికి చెందిన తేలు కృష్ణవేణి గేదె పొలం వద్ద మేస్తూ విద్యుత్ స్తంభం సపోర్ట్ వైరుకు తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన గేదె విలువ రూ.80వేల వరకు ఉంటుందని బాధితురాలు పేర్కొంది. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ బొక్క యాదిరెడ్డి కోరారు.